క్లుప్తంగా

మరిడమ్మ దర్శనానికి భారీగా భక్తులు



భక్తుల నుంచి పూజలందుకుంటున్న మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: మరిడమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని దర్శించుకు నేందుకు భక్తులు బారులుతీరారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రామ్మోహనరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు చేపట్టారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు 25 వేల మంది వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర అందజేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: స్థానిక ఉప్పువారి సత్రం వద్ద విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల శుక్రవారం పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ ఎస్‌వీఎస్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టిడ్కో, వ్యవసాయ సంబంధమైన లైన్లు, జల్లూరు రోడ్డు, పాత తహసీల్దార్ కార్యాలయం, పెద్దబజార్, బలుసులపేట, వీర్రాఘవపురం, సంగీతరావుపేట, ఎన్సన్‌లైన్, స్టేట్‌బ్యాంకు రోడ్డు, తెలుకులపుంత, సంతమార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించాలన్నారు.

వీకే రాయపురం సర్పంచ్‌కు తీవ్ర గాయాలు

సామర్లకోట: వీకే రాయపురం సర్పంచ్ మోర్త పూర్ణిమ వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. పంచాయతీ కార్యదర్శి వై.శ్రీహరి కథనం ప్రకారం గురువారం మోటారు సైకిలుపై తన కుమారునితో కలిసి తుని వెళ్తున్న సమయంలో తేటగుంట వద్ద అదుపు తప్పి మోటారు సైకిల్ నుంచి కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. దాంతో హుటాహుటిన అచ్చంపేట ఏడీబీ రోడ్డులోని మెడికల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి తీవ్రంగా ఉన్నదని చెప్పడంతో కాకినాడ జీజీహెచ్ ఎమర్జెన్సీ వార్డులో చేర్చారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నదని స్థానికులు చెప్పారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ



కొమరగిరిలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందిస్తున్న మాజీ సర్పంచ్ రాజాబాబు

కొత్తపల్లి: విద్యార్థులకు విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమని మాజీ సర్పంచి కరారి రాజాబాబు అన్నారు. మండలంలోని కొమరగిరిలో జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాసంశెట్టి లోవబాబు, మొగిలిసీడి ప్రసాద్, వెదురుపాక సుబ్రహ్మణ్యం, దాసరి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం సామర్లకోట నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న రైలు నుంచి రైల్వే స్టేషన్, ఎల్‌సీ గేటు మధ్యలో సుమారు 45 ఏళ్లున్న వ్యక్తి రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. రైల్వే కీమేన్ పట్టాలపై తిరుగుతున్న సమయంలో మృతదేహాన్ని గుర్తించి ఎస్ఎస్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించక పోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడు చామనచాయ రంగులో ఉండి నీలం రంగు చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు ధరించినట్టు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ ఆర్అండ్ఆర్ కాలనీలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు గోకవరం ఎస్సై కె.నాగరాజు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... ఆర్అండ్ఆర్ కాలనీలోని ఓ ఇంట్లో పేకాడుతున్నారని అందిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.15,320, రెండు సెట్లు కార్డులు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

అలక మాని మొరాలకించరూ!

- పుస్తకాల బ్యాగ్‌లు ఇప్పించండి
- యూనిఫాం కురచ అయిపోయింది
- పాఠశాలల్లో కిట్లు.. విద్యార్థులకు పాట్లు..
- పాఠ్య పుస్తకాల పంపిణీకి పిలవలేదని అధికారులపై ఎమ్మెల్యే చినరాజప్ప ఆగ్రహం
- మిగిలినవి ఆయనతో పంపిణీ చేయించేందుకు ఏర్పాట్లు



సామర్లకోట మండల విద్యాశాఖ కార్యాలయం



పాఠశాలలకు తరలిస్తున్న బ్యాగ్‌లు, యూనిఫాం

సామర్లకోట: ఏటా పాఠశాలలు తెరచిన వెంటనే విద్యార్థులకు అందే కిట్లు ఈ ఏడాది 45 రోజులు గడిచినా పూర్తి స్థాయిలో అందలేదు. నియోజకవర్గ పరిధిలో 154 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో 15,961 మంది విద్యార్థులు చదువుతున్నారు. సామర్లకోట మండల పరిధిలోని విద్యార్థులకు 56,052 నోట్ పుస్తకాలు, 72,168 పాఠ్య పుస్తకాలు, పెద్దాపురం మండల పరిధిలో విద్యార్థులకు 54,164 నోట్ పుస్తకాలు, 68,008 పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కానీ వాటిని తీసుకువెళ్లేందుకు బ్యాగ్‌లు మాత్రం పంపిణీ చేయలేదు. యూనిఫాం కూడా గతేడాదివే వాడుతున్నారు. కొందరు విద్యార్థులు ఎదగడంతో యూనిఫాం సరిపోక అక్కడక్కడా సివిల్ డ్రెస్‌లో కనపడుతున్నారు.

ఎమ్మెల్యేగారి అలక తీరాక మిగిలినవి పంపిణీ..

మండల విద్యాశాఖకు వచ్చిన బ్యాగ్‌లు, యూనిఫాం ఆయా పాఠశాలలకు చేరినా రాజకీయ నాయకులతో వాటి పంపిణీ ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. నోట్, పాఠ్య పుస్తకాల పంపిణీకి తనను పిలవలేదని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఇటీవల నిర్వహించిన మండల సమావేశంలో విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈ పంపిణీ తంతు ఆయనతో ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిసింది. సామర్లకోట మండల పరిధిలోని విద్యార్థులకు 8,087 బ్యాగ్‌లు, 8,087 మంది విద్యార్థులకు, పెద్దాపురం మండల పరిధిలో 8,363 మంది విద్యార్థులకు యూనిఫారం, 8,382 బ్యాగ్‌లు పాఠశాలలో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఆగస్టు 15 నాటికి ప్రతీ పాఠశాలలోను విద్యార్థులు కొత్త యూనిఫారంతో హాజరు అయ్యే విధంగా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిసింది.

బ్యాగ్, యూనిఫాం ఇవ్వాల్సి ఉంది



ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభంలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అయితే బ్యాగ్‌లు, యూనిఫారం ఇంకా ఇవ్వలేదు. పూర్తయిన సిలబస్‌పై మరుసటి రోజు రివిజన్ చేయిస్తున్నారు. స్మార్ట్ టీవీలతో విద్యాబోధన ఆసక్తికరంగా ఉంది.

– స్వర్ణ సాయి సంతోషి, 8వ తరగతి, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్‌హైస్కూల్, సామర్లకోట

నోట్, పాఠ్య పుస్తకాలు ఇచ్చారు



గతంలో ఏటా పాఠశాల తెరిచిన తరువాత నోట్‌పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బూట్లు, సాక్సులు, యూనిఫారం, డిక్షనరీలతో కలిపి కిట్లు అందజేసేవారు. అయితే ప్రస్తుతం నోట్‌పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు మాత్రమే ఇచ్చారు.

– కోనా నాగవెంకట ఆంజనేయస్వామి, 10వ తరగతి, వీకే రాయవరం, జెడ్పీ హైస్కూల్, సామర్లకోట మండలం

పాఠశాల స్థాయిలో అందజేత



నియోజకవర్గ, మండల స్థాయిలో ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థుల కిట్లు ప్రారంభించిన తరువాత, గ్రామ స్థాయిలో పాఠశాలల పరిధిలో స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా విద్యార్థులకు కిట్లు అందజేస్తాం. విద్యార్థులు ఇబ్బంది పడకుండా నోట్, పాఠ్య పుస్తకాలు ఇచ్చాం. బ్యాగ్, యూనిఫారం, డిక్షనరీ, బూట్లు, సాక్సులు, బెల్టులు పంపిణీ చేయాల్సి ఉంది. ప్రస్తుత సంవత్సరం జూనియర్ కళాశాల విద్యార్థులకు పుస్తకాలు వచ్చాయి. కానీ బ్యాగ్‌లు, యూనిఫాం విషయంపై స్పష్టత లేదు. మండల పరిధిలోని అన్ని పాఠశాలలకు గురువారంతో పంపిణీ ముగిసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య కంటే ఇంకా చేరికలు ఉండడం వల్ల పెరిగే అవకాశం ఉంది.

– పి. పుల్లయ్య, మండల విద్యాశాఖాధికారి 2, సామర్లకోట

తెలుగు అధ్యాపకురాలు మాధవికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన మాధవిని సత్కరిస్తున్న అధ్యాపకులు

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పని చేస్తున్న కె.మాధవి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు గురువారం కళాశాలలో ఆమెను సత్కరించారు. ×పోతన భాగవతం– అద్వైత తత్వం అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (తిరుపతి) ఆమెకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.శుభాషిణి మాట్లాడుతూ ప్రాచీన గ్రంథాలు, సంస్కృతిపై పరిశోధనలు చేయడానికి ఎంతో అవకాశం ఉందన్నారు. విదేశీయులు సైతం మన ప్రాచీన సంస్కృతిపై పరిశోధనలు చేస్తున్నారని తెలిపారు. డాక్టరేట్ పొందిన డాక్టర్ మాధవిని ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఇలాంటి మరెన్నో పరిశోధనలు చేసి మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



స్వచ్ఛత వారోత్సవాల్లో ఆర్బీ పట్నంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ



చేబ్రోలులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పిఠాపురం: ప్రజలందరూ శుభ్రత పాటించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి సహకరించాలని గొల్లప్రోలు ఎంపీడీవో జయప్రకాష్ విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు, చెందుర్తి తదితర గ్రామాల్లో గురువారం ప్లాస్టిక్ వాడకం నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామపంచాయతీల పరిధిలో చెత్త నిల్వ ప్రాంతాలను గుర్తించి ట్రాక్టర్, జేసీబీ సాయంతో వ్యర్థాలను తొలగించారు. ప్లాస్టిక్ సంచుల వాడకం, విక్రయాన్ని నిలిపివేయాలని దుకాణదారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల్లో ఎవరికి వారు పరిశుభ్రత పాటించాలన్నారు. వీధుల్లో చెత్త పేరుకుపోకుండా చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉండడానికి సహకరించాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ నిషేధం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కుమార్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్ దత్తు, రాజేంద్ర కుమార్ రాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పెద్దాపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ ఎం.ఉషారాణి అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రాయభూపాలపట్నంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమానికి ఆమె శ్రీకారం చుట్టారు. సర్పంచ్ చీకట్ల లక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటా మంచి మొక్కలు నాటాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ప్రజారోగ్య పరిరక్షణ కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫణి, వీహెచ్‌పీ ఎం.చిలకమ్మ, మాజీ ఎంపీటీసీ కల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోజనం లేని పనులేల?



కాకినాడ రోడ్డులో ఫుట్‌పాత్ కింద ఖాళీల్లో పూడుకుపోయిన మట్టి

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో నీరు నిలిచిపోతున్న ప్రదేశంలో బ్లేడ్ ట్రాక్టరుతో మట్టి తొలగించి మూసుకుపోయిన రంధ్రాలను వదలివేశారు. స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి కాకినాడ వెళ్లే మార్గంలో గూడ్ షెడ్ సమీపంలో రోడ్డుపై నీరు గోదావరి కాలువలోనికి పోయేలా రంధ్రాలు ఏర్పాటు చేశారు. వర్షాలు వచ్చిన సమయంలో కొట్టుకు వచ్చిన మట్టితో అవి పూడుకుపోయాయి. దీంతో నీరు పోయే మార్గం లేక నిలిచిపోయింది. ఈ సమయంలో పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో పక్కనున్న చిన్న వాహనాల చోదకులపై ఆ బురద నీళ్లు తుళ్లుతూ ఇబ్బంది పెడుతున్నాయి. దీనిపై వెలువడిన పత్రికా కథనానికి స్పందించిన ఆర్అండ్‌బీ జేఈ తోట మంగాదేవి రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించే ఏర్పాటు చేశారు. అయితే రంధ్రాలలో ఉన్న మట్టి తీయక పోవడం వల్ల వర్షపు నీరు పాయే అవకాశం లేదని, మట్టి తీయడం వల్ల ప్రయోజనం ఏంటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

అపరిచితులతో అప్రమత్తం



ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న సెట్రాజ్ సీఈఓ, ట్రైనర్, ఉపాధ్యాయులు

కరప: ప్రేమ పేరుతో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, కిడ్నాప్‌ల వంటి ఉదంతాలు జరుగుతున్న నేపథ్యంలో అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సెట్రాజ్ సీఈఓ ఏవీఎస్ఎన్ మూర్తి సూచించారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ విద్యార్థినులతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో చదువుపైనే ఏకాగ్రతతో ఉండాలని సూచించారు. అమ్మాయిల అక్రమ రవాణా ఎలాజరుగుతున్నదీ, వాటి పర్యవసనాలు వివరించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ట్రైనర్ రమ్యసుధ మాట్లాడుతూ బాలికలకు బ్యాడ్, గుడ్‌టచ్ గురించి అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ ఎం.శ్రీరామచంద్రమూర్తి, పి.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు లేని వారికి ఐవీఎఫ్ ఒక వరం

బోట్‌క్లబ్: పిల్లలు లేని వారికి ఐవీఎఫ్ ఒక వరమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవం సందర్భంగా గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు పురుషులకు ఐవీఎఫ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యాధికారి అడబాల మాధవి మాట్లాడుతూ వంధ్యత్వంతో పోరాడుతున్న దంపతులకు బిడ్డను కనడానికి సహాయపడే ఒక వైద్య ప్రక్రియ ఐవీఎఫ్ అని వివరించారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు.. అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర, శ్రీవల్లి పాల్గొన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి

- ఎంఈఓ శివరామకృష్ణయ్య



అచ్చంపేటలో సాంస్కృతిక ప్రదర్శనను తిలకించిన ఎంఈఓ, ఉపాధ్యాయులు

సామర్లకోట: మండల పరిధిలో బడి బయట పిల్లలు లేకుండా చూడాలని, ప్రతి పాఠశాలలో విద్యార్థుల చేరికలు పెరగాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. మండల పరిధిలో ఉండూరు, వల్లూరు, కాపవరం, అచ్చంపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యా ప్రవేశాలు, సంసిద్ధత కార్యక్రమాలు, శిక్షా సప్తహ్ అమలును పరిశీలించారు. విద్యా ప్రవేశ కార్యక్రమాలను దీక్ష యాప్‌లో లాగిన్ అయి ప్రతి ఉపాధ్యాయుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. పాఠశాలలో నమోదైన ప్రతి విద్యార్థి యూడైస్‌లో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థుల పఠనా, రాత నైపుణ్యాలను ఆయన పరిశీలించారు. ఆగస్టు నెలలో ప్రారంభమయ్యే పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా అచ్చంపేటలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బచ్చు ఫౌండేషన్ పాఠశాలలో..

స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూలులో హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ నిర్వహించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తి గేయాలు జాతీయ సమైక్యతకు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. పాఠశాల సోషల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ జాతీయ నాయకుల మాస్కులు ధరించారు.

ముందస్తు యాజమాన్య చర్యలు చేపట్టాలి

- ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.దయాకర్

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ముందస్తు యాజమాన్య పద్ధతులు పాటించాలని స్థానిక ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.దయాకర్ సూచించారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రధానంగా వరి పంటలో నారు పోసుకునే దశ నుంచి దుబ్బు కట్టే దశలో ఉన్నందున ఎక్కడైతే పంట పూర్తిగా నీరు ముంపునకు గురవుతుందో అక్కడ పూర్తిగా నీటి నిల్వను తొలగించి పొలాన్ని ఆరబెట్టాలన్నారు. ఐదు సెంట్ల నారుమడిలో కిలో యూరియా, కిలో పొటాషియం ఎరువులను పైపాయగా వేసుకోవాలన్నారు. ఉడ్చిన పొలంలో ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. ప్రత్తి పంటకు సంబంధించి 50 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. ఈ ఎరువులతో పాటు 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను వేసుకోవాలని దయాకర్ తెలిపారు. అలాగే అపరాల పంటకు సంబంధించి పంటను ఆశించే రసం పీల్చే పురుగు, ఆకుచుట్టు పురుగుల తీవ్రతను అంచనా వేసుకుని మోనోక్రోటోఫ్రాన్ 1.6 మిల్లీ గ్రాముల పౌడర్‌ను నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న రైతులు అధిక తేమ వల్ల ఎరువులతో పాటు వేసుకోవాలన్నారు. కత్తెర పురుగు అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున వేప గింజల కషాయం పిచికారీ చేసుకోవాలన్నారు.

మడ అడవులను సంరక్షించుకుందాం

- జిల్లా అటవీ అధికారి భరణి
- విద్యార్థులకు పోటీల నిర్వహణ



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా అటవీ అధికారి భరణి తదితులు

కాకినాడ సిటీ: మడ అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా అటవీశాఖాధికారి ఎస్.భరణి అన్నారు. అంతర్జాతీయ మడ అడవి ఆవరణ వ్యవస్థ, పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, తాళ్లరేవు మండలాల్లో ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులకు మడ అడవుల సంరక్షణపై చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ పోటీలకు 43 పాఠశాలలు, కళాశాలల నుంచి 289 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు శుక్రవారం బహుమతులు అందిస్తామన్నారు. ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ మడ అడవుల ఆవరణ వ్యవస్థ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలవబడే డాక్టర్ రాజేంద్రసింగ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఎస్ సుబ్రహ్మణ్యం, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ విజయకుమారి, ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జి.సూరిబాబు, ఎంవీఎస్ రామకృష్ణ, బి.లక్ష్మి, కె.దుర్గాప్రసాద్, అధ్యాపకులు చిట్టిబాబు, శ్రీమన్నారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి భరణి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు.

లక్ష్యం.. ఫ్లెక్సీ ఫ్రీ సిటీ



అనుమతి లేని ఫ్లెక్సీలను సిబ్బందితో కలిసి తొలగిస్తున్న కమిషనర్ భావన

- అనుమతి లేని ఫ్లెక్సీలు తొలగించండి
- సెప్టెంబర్ కల్లా లక్ష్యం సాధించాలి
- అధికారులకు కమిషనర్ భావన ఆదేశం

కాకినాడ: అనుమతి లేని ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక వెంకట్ నగర్‌లోని సురేష్ చికెన్ సెంటర్ నుంచి సాయిబాబా ఆలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ నగరపాలక సంస్థ అనుమతి లేని ఫ్లెక్సీలు అన్నింటినీ తక్షణమే తొలగించాలని టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు. అనుమతి లేని ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌లను తొలగించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కోరారు. సెప్టెంబర్ నాటికల్లా కాకినాడను ఫ్లెక్సీ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నగర సుందరీకరణను దృష్టిలో ఉంచుకొని ఆయా వ్యాపార సంస్థలు నగరపాలక సంస్థకు సహకరించి అనుమతి లేని ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. అలా తొలగించని పక్షంలో నగరపాలక సంస్థ తరఫున తొలగించి వాటిని ఏర్పాటు చేసిన సంస్థలపై తగిన చర్య తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, పలువురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పాలిథిన్ కవర్లకు దూరంగా ఉండండి

పర్యావరణానికి హాని కలిగే తక్కువ మందం కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లకు దూరంగా ఉండాలని కమిషనర్ భావన పిలుపునిచ్చారు. స్థానిక 27వ డివిజన్ తిలక్ వీధిలోని సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద నుంచి ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ర్యాలీని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నిషేధించిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వీటికి ప్రత్యామ్నాయంగా కాటన్ బ్యాగులను ఉపయోగించాలని సూచించారు. ఆ మేరకు విద్యార్థులు చైతన్యవంతులు కావాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సుంకర పావని, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.